క్లుప్తంగా

అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



యానాం: నియోజకవర్గ పరిధిలోని దొమ్మేటిపేటలో కొలువైన అభయాంజనేయ స్వామివారి ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యానాం పరిసర ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. కోరంగి నదీ తీరంలోని శివాలయం ఆవరణలో కొలువైన భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ వ్రత కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అర్చకులు పెద్దింటి నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పుణ్యాహవాచనం, మండపారాధన, పంచామృతాభిషేకాలు చేశారు.

2న లక్ష తులసి పూజ

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు కేశవపురంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయంలో వచ్చే నెల 2వ తేదీన లక్ష తులసి పూజను నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీను తెలిపారు. అదే సమయంలో ఆంజనేయస్వామివారికి లక్ష తమలపాకులు, సింధూర పూజలు సైతం నిర్వహిస్తారన్నారు. 14వ తేదీన గోదాదేవి కల్యాణం ఘనంగా జరుపుతామని చెప్పారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం



కొప్పిశెట్టి వెంకటరావు

అమలాపురం టౌన్: ప్రకాశం జిల్లా కావలిలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో అమలాపురానికి చెందిన కొప్పిశెట్టి వెంకటరావు 800 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానాన్ని సాధించి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. 55 ఏళ్ల విభాగంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు వెంకటరావు తెలిపారు.

ఉత్తమ ఏరియా కోఆర్డినేటర్‌గా సత్యనారాయణరెడ్డి



వాకర్స్ ఉత్తమ ఏరియా కోఆర్డినేటర్ అవార్డును అందుకుంటున్న సత్యనారాయణరెడ్డి

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన తేతల సత్యనారాయరెడ్డికి వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ బెస్ట్ ఏరియా కోఆర్డినేటర్–2023 అవార్డును ప్రకటించింది. ఆదివారం విశాఖపట్టణంలో జరిగిన వాకర్స్ ఇంటర్నేషనల్ సదస్సులో అధ్యక్షుడు డాక్టర్ రవీంద్ర చేతుల మీదుగా సత్యనారాయణరెడ్డి అవార్డును అందుకున్నారు. నూతన వాకర్స్ క్లబ్‌ల ఏర్పాటు, ప్రజల్లో నడక చైతన్యం కల్పించడం, సేవా కార్యక్రమాల నిర్వహణ వంటి అంశాల్లో చొరవ కారణంగా ఆయనకు అవార్డు ప్రకటించారు. ఆయనను అమలాపురం వాకర్స్ క్లబ్‌ల ప్రతినిధులు అభినందించారు.

రమేష్‌కు సత్కారం



గోపవరంలో రమేష్‌ను అభినందిస్తున్న సర్పంచ్ బుల్లియ్య తదితరులు

ఉప్పలగుప్తం: ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఎస్ఐ ఉద్యోగం సాధించిన మండలంలోని గోపవరానికి చెందిన తాళ్ల రమేష్‌ను స్థానిక సర్పంచ్ కుంచే బుల్లియ్య ఆదివారం దుశ్శాలువాతో సత్కరించారు. విధి నిర్వహణలో ప్రజలకు సేవలందించి గ్రామానికి ఉన్నతమైన పేరు తీసుకురావాలని బుల్లియ్య కోరారు. రమేష్‌ను అభినందించిన వారిలో వైస్ ఎంపీపీ సాదే శ్రీనివాసరావు, నల్లా వెంకన్న, కుంచే స్వామి, వాకపల్లి శ్రీనుబాబు, కాకర బాలాజీ, మట్టపర్తి కనకదుర్గ తదితరులున్నారు.

మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడి నియామకం



చిరంజీవి

ఐ.పోలవరం: మహాజన్ సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా మండలంలోని కొమరగిరికి చెందిన వీధి చిరంజీవిమాదిగ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయనను జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సవరపు భైరవమూర్తి, ఉందుర్తి కిశోర్ తదితరులు అభినందించారు. తనను ఉపాధ్యక్షుడిగా నియమించిన మందకృష్ణ మాదిగ, ముమ్మిడివరం చిన సుబ్బారావు మాదిగలకు ఆదివారం ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

సేవా నిలయాలు.. గ్రామ సచివాలయాలు

- ఈ వ్యవస్థతో మహాత్ముని కల సాకారం
- నిరంతరం ప్రజలకు అందుబాటులో అధికారులు
- ఇంటి వద్దకే సేవలన్నీ..
- సంతృప్తి వ్యక్తం చేస్తున్న ప్రజలు



జి.వేమవరం గ్రామ సచివాలయం



జార్జిపేట గ్రామ సచివాలయంలో సేవలందిస్తున్న సచివాలయ సిబ్బంది

తాళ్లరేవు: మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం గ్రామ సచివాలయ వ్యవస్థతో సాకారమవుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసి, ప్రజలకు గ్రామ స్థాయిలోనే సత్వర సేవలు అందిస్తున్నారు. ఒక గ్రామ సచివాలయంలో 10 నుంచి 12 శాఖల అధికారులను నియమించారు. ప్రజలకు అవసరమైన సేవలందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా వారి గ్రామాల్లోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పింఛన్, రేషన్, ఏ పథకమైనా సరే, ఇంటివద్దే అందించడంతో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. దీంతో సచివాలయాలు ప్రజలకు సేవా నిలయాలుగా మారాయి.

సాహసోపేత నిర్ణయం

రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలు ఏర్పాటు చేయాలంటే వేల కోట్లతో కూడుకున్న ప్రాజెక్ట్. అయినప్పటికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేశారు. ఉద్యోగులను నియమించి, ఫర్నిచర్‌ను ఏర్పాటు చేయడం తలకు మించిన భారమైనా, దీనిని లెక్కచేయకుండా వాటన్నింటినీ చకచకా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకువచ్చారు. అంతటితో ఆగకుండా కోట్లాది రూపాయలు వెచ్చించి సచివాలయాలకు కొత్త భవనాలను నిర్మించి, వ్యవస్థను పటిష్టం చేస్తున్నారు. జగనన్న తీసుకున్న నిర్ణయం సాహసోపేతమని ప్రజలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆయా సచివాలయాల ద్వారా తమకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

తాళ్లరేవు మండలంలో సచివాలయాలు 24

నాలుగేళ్లలో మండలంలో అన్ని రకాల పథకాల లబ్ధిదారులు	85,096
లబ్ధిదారులు అన్ని రకాల పథకాల్లో పొందిన లబ్ధి	రూ.231 కోట్లు
వైఎస్సార్ ఆసరా తీసుకున్న లబ్ధిదారులు	2121
వైఎస్సార్ ఆసరా ద్వారా పొందిన లబ్ధి	రూ.10 కోట్లు
మండలంలో వివిధ రకాల పింఛన్లు పొందుతున్న వారు	11,209
మండలంలో పెన్షనర్లు పొందిన లబ్ధి	రూ.99 కోట్లు

వైఎస్సార్ బీమా రూ.5 లక్షలు ఇచ్చారు



నా భర్త బాలకృష్ణ అనారోగ్య కారణాలతో మృతి చెందారు. అధికారులు ఇంటికి వచ్చి వివరాలన్నీ రాసుకుని రూ.5 లక్షలు వైఎస్సార్ బీమా వచ్చేలా చేశారు. మా కుటుంబం జగనన్నకు రుణపడి ఉంటుంది.

– మాతా మణి, తాళ్లరేవు

సేవలన్నీ సత్వరమే అందిస్తున్నాం



సచివాలయాల ద్వారా ప్రభుత్వానికి సంబంధించిన అనేక రకాల సేవలను సత్వరమే అందిస్తున్నాం. ముఖ్యంగా నవరత్నాలకు సంబంధించిన పింఛను పంపిణీ, అందరికీ ఇళ్లు, చేదోడు, చేయూత, మ్యుటేషన్, ఇల్లు, భూముల రీసర్వే, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, సీఎం, పీఎం కిసాన్ తదితర పథకాలను వలంటీర్ల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఇంటి వద్దకే అందజేస్తున్నాం.

– టేకుమూడి వేణుగోపాల్, సచివాలయ కార్యదర్శి, తాళ్లరేవు–2 సచివాలయం

ఇంటి వద్దనే పింఛను ఇస్తున్నారు



గతంలో పింఛను నగదు తీసుకునేందుకు నానాపాట్లు పడేవాళ్లం. పంచాయతీ కార్యాలయానికి వెళ్లి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. తీరా ఆ అధికారి వచ్చాక మెషీన్ పని చేయడం లేదని మరలా రమ్మనేవారు. ఇప్పుడు మాత్రం ఒకటో తేదీనే ఇంటి వద్దకు వచ్చి మరీ చేతిలో నగదు పెడుతున్నారు. ఎటువంటి కష్టం లేకుండా పింఛను ఇస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

– కర్రి సత్యనారాయణ, గాడిమొగ పంచాయతీ

అడిగిన వెంటనే ధ్రువీకరణ పత్రాలు



కళాశాలలో చేరేందుకు ధ్రువీకరణ పత్రాలు అడిగిన వెంటనే ఇచ్చారు. గతంలో ఒక్క సర్టిఫికెట్ కోసం కార్యాలయాలు, అధికారుల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు దరఖాస్తు చేసుకున్న గంటల వ్యవధి లోనే ఒకేసారి నాలుగైదు సర్టిఫికెట్ కాపీలు ఇస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా సర్టిఫికెట్లు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. థాంక్స్ టు జగనన్న.

– అంకాడి వీరబాబు, విద్యార్థి, గాడిమొగ పంచాయతీ

మహిళలు స్వశక్తితో ఎదగాలి



శిక్షణా కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీ చింతా అనురాధ

అల్లవరం: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా స్వయం ఉపాధిని పొంది స్వశక్తితో ఎదగాలని ఎంపీ చింతా అనురాధ అన్నారు. ఓఎన్‌జీసీ వారి సౌజన్యంతో గోడిలంక, తుమ్మలపల్లి గ్రామాల్లో మహిళలకు ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ కుట్టుమిషన్ శిక్షణ తీసుకున్న మహిళలు తమ సొంత సృజనాత్మకతను జోడించి పోటీ ప్రపంచంలో రాణించాలన్నారు. మహిళలు స్వయం ఉపాధిని పొందుతూ ఆర్థికంగా, సామాజికంగా సమాజంలో మంచి గుర్తింపుని పొందాలన్నారు. మహిళలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా తనను నేరుగా సంప్రదించవచ్చని భరోసా కల్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వడ్డి గంగ, ఎంపీటీసీ పులుసుగంటి రాజేశ్వరి, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర 3కే మారథాన్



3కే మారథాన్ పోటీల విజేతలతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి తదితరులు

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ఆడుదాం ఆంధ్ర' ఆటల పోటీల్లో భాగంగా అమలాపురం గడియారం స్తంభం సెంటరు నుంచి వై.జంక్షన్ వరకూ 3కే మారథాన్ నిర్వహించారు. పరుగు పందెం పోటీలను ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు ప్రారంభించారు. తొలుత నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆడుదాం ఆంధ్ర.. అందరి ఆట అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. పరుగు పందెంలో బాలుర విభాగంలో మొదటి స్థానాన్ని రెడ్డి నవేంద్రకుమార్, రెండో స్థానాన్ని ఎల్.కేశవవర్మ, మూడో స్థానాన్ని ఎ.జగన్, బాలికల విభాగంలో మొదటి స్థానాన్ని సీహెచ్ బాలాశ్రీలక్ష్మి, రెండో స్థానాన్ని ఎ.కుందన, మూడో స్థానాన్ని షకీలా సాధించారు. విజేతలకు ముఖ్య అతిథులు పతకాలు, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు కట్టోజు సన్యాసిదాసు, నాగారపు వెంకటేశ్వరరావు, కొల్లాటి దుర్గాబాయి పాల్గొన్నారు.

ఊరూరా క్రిస్మస్ సంబరాలు



విద్యుత్ వెలుగుల్లో యానాం రోమన్ కేథలిక్ చర్చి



క్రిస్మస్ వేడుకలకు ముస్తాబైన చర్చి



విద్యుత్ దీపాల అలంకరణలో ముమ్మిడివరం ఆర్‌సీఎం చర్చి

ఐ.పోలవరం: క్రీస్తు జననాన్ని పురస్కరించుకుని క్రైస్తవులు ఉమెన్, యూత్, చిల్డ్రన్, గ్రాండ్ క్రిస్మస్ పేరిట క్రిస్మస్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వితంతువులకు, పేదలకు వస్త్రాల పంపిణీ, పేదలకు అన్నసమారాధన కార్యక్రమాలతో పాటు కొవ్వొత్తులతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. సోమవారం క్రిస్మస్ పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి నుంచే సంబరాలు అంబరాన్నంటాయి. క్రిస్మస్ ఈవ్ పేరిట ఆదివారం రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మండలంలోని కొమరగిరి, టి.కొత్తపల్లి, కేశనకుర్రు తదితర గ్రామాల్లో ఉన్న చర్చిల్లో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

క్రిస్మస్ సంబరాలకు సిద్ధం

ముమ్మిడివరం: క్రైస్తవులంతా సోమవారం జరగనున్న క్రిస్మస్ సంబరాలకు సిద్ధమయ్యారు. ఇళ్లల్లోనూ, చర్చిల్లోనూ క్రీస్తు పుట్టిన పశువుల పాకను బొమ్మలతో అలంకరించుకున్నారు. ముమ్మిడివరం ఆర్‌సీఎం చర్చి, మున్నా చర్చి, పశువుల్లంకలో ఆర్‌సీఎం చర్చి, టి.కొత్తపల్లిలో సెయింట్ పాల్ చర్చి, కాట్రేనికోన ఎబినేజర్ మందిరం, తాళ్లరేవు ఒసన్నా ప్రార్థనా మందిరం, జూబ్లి చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. దేశంలోని అతి పెద్దదైన ఏసుక్రీస్తు విగ్రహాన్ని యానాం రాజీవ్ బీచ్‌లో ఏర్పాటు చేశారు. ఇది పర్యాటక కేంద్రమే కాకుండా ఆధ్యాత్మిక కేంద్రంగా తయారైంది. ఇక్కడ క్రిస్మస్ వేడుకలకు పుదుచ్చేరి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. క్రిస్మస్ సందర్భంగా బేకరీల్లో వివిధ ఆకృతుల్లో తయారుచేసిన కేక్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

యానాం: నియోజకవర్గ పరిధిలో క్రిస్మస్ వేడుకల కోసం చర్చిలను అందంగా అలంకరించారు. ప్రార్థనలకు అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరుకానుండటంతో విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆదివారం రాత్రి నుంచి క్రిస్మస్ వేడుకలు పలు చర్చిల్లో ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రఖ్యాత రోమన్ కేథలిక్ చర్చిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చర్చిలో పశువుల పాకలో బాల ఏసు జననాన్ని తెలిపేలా పశువులపాక నమూనాను అందంగా తీర్చిదిద్దారు. ఫాదర్ మరియదాసు క్రిస్మస్ పర్వదిన సందేశాన్ని అందించనున్నారు. అంబేడ్కర్ నగర్‌లో ప్రముఖ బాప్టిస్టు చర్చిని సైతం సుందరీకరించారు.

ఆనందమానందమాయె..



ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1977-78 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

అయినవిల్లి: మండలం ముక్తేశ్వరం జయంతి రామయ్యపంతులు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1977–78 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఒకచోటకు చేరి సంబరాలు చేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు. వారి ఆశీస్సులు తీసుకున్నారు. తమ ఉన్నతికి మీరే కారణం అంటూ మీరు ఇచ్చిన దీవెనలేనంటూ వారిని కీర్తించారు. వచ్చిన పూర్వ విద్యార్థులందరికీ బహుమతులు అందజేశారు. ఉదయం ప్రారంభమైన ఈ సంబరం సాయంత్రం ఆరు గంటల వరకూ సాగింది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జిహ్వాకూ పసందైన విందునూ ఆరగించి ఒకరినొకరూ ఆనంద భాష్పాలతో వీడ్కోలు చెప్పుకొన్నారు.

ప్రకృతి వ్యవసాయానిదే భవిష్యత్



కత్తిమండలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

మలికిపురం: భవిష్యత్‌లో ఆహార ఉత్పత్తిలో ప్రకృతి వ్యవసాయానిదే కీలక పాత్ర అని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు తనయుడు వెంకట్రామ్ అన్నారు. సెర్ప్ సీఈవో ఆదేశాలతో ఏపీసీఎన్ఎఫ్ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విజయవంతంగా అమలు చేస్తున్న నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయ విధానంపై మండల సమాఖ్య ఓబీ సభ్యులకు మండలంలోని కత్తిమండలో ఆదివారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న వెంకట్రామ్ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్పించుకుని సాగు చేయాలని సూచించారు. మండల సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు జి.సుమలత మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించి రసాయన రహిత వ్యవసాయం చేయాలని సూచించారు. మండల ఏపీఎం డి.వరాలబాబు, శిరీష, సీసీ బి.నాగరాజు, ఎంటీ జోసెఫ్, సీహెచ్ చిట్టిస్వరాజ్, నాగబాబు, రవికాంత్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థి ప్రతిభ

అయినవిల్లి: రామచంద్రపురంలో జిల్లా స్థాయిలో జరిగిన సైన్స్ వైజ్ఞానిక ప్రదర్శనలో నేదునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి తిప్పా గౌతమ్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నాను. గౌతమ్‌ను పలువురు అభినందించారు. టీచర్ ఎగ్జిబిట్‌లో విలస ప్రధానోపాధ్యాయుడు ప్రదర్శన తృతీయ స్థానంలో నిలిచింది. వీరు ఈ నెల 28, 29లో కడపలో జరిగే రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యారు.

నేడు కేంద్రమంత్రి మురుగన్ యానాం రాక

యానాం: కేంద్రమంత్రి ఎల్.మురుగన్, రాజ్యసభ సభ్యుడు సెల్వగణపతి, పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం, పుదుచ్చేరి జిల్లా కలెక్టర్ వల్లవన్ తదితరులు సోమవారం యానాం విచ్చేయనున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ నిధులు రూ.53 కోట్లతో నిర్మించిన జిప్‌మెర్ ఆసుపత్రిని ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 4 గంటలకు వికసిత్ భారత్ కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. అనంతరం స్థానిక ఎస్‌టీపీపీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సభ ఉంటుందన్నారు.

టీబీ ముక్త భారత్

ప్రధాని మోడీ సంకల్పం మేరకు టీబీ ముక్త భారత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం యానాం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టీబీ నిర్ధారణ పరీక్షలు చేయనున్నట్లు జీజీహెచ్ డీడీ రవిశంకర్ తెలిపారు.

ఈ నెల 28న పురందేశ్వరి రాక



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దొరబాబు

అమలాపురం రూరల్: ఈ నెల 28వ తేదీన అమలాపురంలో జరిగే బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయ ప్రారంభోత్సవానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి హాజరవుతారని పార్టీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు తెలిపారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ శ్రేణులందరూ హాజరై పురందేశ్వరి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ శాసన సభ్యుడు మానేపల్లి అయ్యాజీ వేమ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు, అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి కర్రి చిట్టిబాబు, మోకా వెంకటసుబ్బారావు తదితరులు హాజరయ్యారు.

బౌద్ధ ధమ్మంపై పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న బుద్ధ విహార్ కమిటీ సభ్యులు

అమలాపురం రూరల్: కవి సరేళ్ల వెంకటరత్నం రచించిన బౌద్ధ ధమ్మంపై ఒక అసాధారణ సమర్పణ పుస్తకావిష్కరణ కార్యక్రమం అమలాపురం బుద్ధవిహార్‌లో ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి అల్లవరం జెడ్పీటీసీ సభ్యురాలు కొనుకు గౌతమి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ గౌతమ బుద్ధుడి బోధనలు సర్వమానవాళికి ఆచరణీయమైనవన్నారు. సరేళ్ల వెంకటరత్నం రచనలు బౌద్ధం గొప్పతనాన్ని చాటుతున్నాయని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాది డీబీ లోక్, న్యాయవాది పినిపే రాధాకృష్ణ, ఉదయకుమార్, ముంగండ ఆశీర్వాదం, చిట్టిబాబు, తోట బాలకృష్ణ, కోడూరి రామమూర్తి, ఉండ్రు శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు సాయం అందిస్తున్న రమణారావు

అమలాపురం రూరల్: ఇటీవల నడిపూడిలో జరిగిన అగ్ని ప్రమాదంలో తాటికిల్లు కాలిపోయి సర్వస్వం కోల్పోయిన దొండపాటి లోవరాజు కుటుంబానికి వైఎస్సార్ సీపీ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కుంచే రమణారావు సాయం చేశారు. బాధిత కుటుంబానికి దుస్తులు, వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు ఆదివారం ఆయన అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చెల్లుబోయిన నాని, ఉప సర్పంచ్ కాట్రు వసంతకుమార్, వాసంశెట్టి భానోజీ, ఫౌండేషన్ సభ్యులు గంటా లక్ష్మీప్రసాద్, కుంచే వెంకటేశ్వరరావు, మనోజ్ కొంకి, పరమట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరం: తమను రెగ్యులైజ్ చేయాలని కోరుతూ విద్యాశాఖ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, పార్ట్ టైం ఉద్యోగులు చేపట్టిన సమ్మె ఆదివారం ఐదో రోజుకు చేరింది. పలు డిమాండ్లతో స్థానిక ఎయిమ్స్ కళాశాల నుంచి ఎంపీడీఓ కార్యాలయం వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద వినతి పత్రం సమర్పించారు.

శివారు ప్రాంతాలకు రక్షిత నీరు పంపిణీ

రాజోలు: నియోజకవర్గంలోని అన్ని శివారు ప్రాంతాలకు రక్షిత తాగునీరు అందించేందుకు పైప్‌లైన్ విస్తరణ, కొత్త తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనులు వేగవంతంగా చేపడుతున్నామని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం కూనవరం, తాటిపాక గ్రామాల్లో పైప్‌లైన్ విస్తరణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఆయన మట్లాడుతూ రానున్న వేసవిలో రక్షిత తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యంగా తీరప్రాంతాలు, శివారు ప్రాంతాలు లక్ష్యంగా పైప్‌లైన్ విస్తరణ పనులపై దృష్టి సారించామన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమం, అభివృద్ధి విరాజిల్లుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని విజయపథంలో నిలపాలని కోరారు. సర్పంచ్‌లు బోనం అచ్చియ్యనాథం, కోటిపల్లి రత్నమాల, ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, జెడ్పీటీసీ మట్టా శైలజ, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్తేరు రాణి తదితరులు పాల్గొన్నారు.